## Rog - by Himanshu Brambhatt

Back

| | |
|---|---|
| Language | : Hindi |
| Music Director | : MM Kreem, Gaudi, Music Mushrooms |
| Lyric Writers | : Neelesh Mishra, Sayeed Quadri, Gaudi |
| Singers | : Shreya Ghosal, KK, MM Kreem, Udit Narayan, Gaudi |
| Actors | : Irfan Khan, Ilene Hamman |
| Director | : Himanshu Brambhatt |
| Reviewer | : SKU<br>మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి |
| Trailors | : http://www.indiafm.com/cgi-bin/trailors.cgi?r/rog/rog1.zip<br>http://www.indiafm.com/cgi-bin/trailors.cgi?r/rog/rog2.zip<br>http://www.indiafm.com/cgi-bin/trailors.cgi?r/rog/rog3.zip |

పూజా భట్.. ఆవిడ నటిగా కన్నా ఇతర విషయాల ద్వారా ఎక్కువ పేరు వున్న నటి! మిగిలిన నటీమణులు కెరీర్ కోసం రేయీపగలూ కష్టపడుతుంటే, ప్రముఖ దర్శకుడి కుమార్తె అయినప్పటికీ ఆమె నటనని చాలా తేలిగ్గా తీసుకున్నారు అనే చెప్పాలి. నటన విసుగు వచ్చిన మరుక్షణం, నిర్మాత గా మారి చిత్రాలు తీయటం మొదలెట్టారు. ఒకరకం గా ఆమె చిత్రాలు అన్నీ ఆమె లాగే బోల్డ్ స్టేట్ మెంట్ లు అనిపిస్తాయి. తమన్నా, జిస్మ్, సుర్, పాప్ ఇప్పుడు రోగ్. ఈ చిత్రాలు అన్నిటిలోనూ వున్నది చక్కటి సంగీతం. దక్షిణాది సంగీత దర్శకుడు కీరవాణి (ఉత్తరాది వారికి MM క్రీమ్) దక్షిణాది చిత్రాలకి కూడా చక్కటి సంగీతం ఇచ్చినప్పటికీ, ఆయన లోని ప్రతిభ ని పూర్తిగా ఉపయోగించుకున్నది మాత్రం బాలీవుడ్, అందులోనూ, భట్ కుటుంబం అనే చెప్పాలి. వారి కాంబినేషన్ లో వచ్చిన అన్ని



చిత్రాలు చక్కటి సంగీతం తో నిండివుంటాయి. మరి ఆ విజయవంతమైన కాంబినేషన్ లో వచ్చిన తదుపరి చిత్రం "రోగ్". ఈ చిత్రం లో బాలివుడ్ వారు కేవలం కేరక్టర్ నటుడిగా మిగిల్చేసిన ఇర్ఫాన్ ఖాన్, దక్షిణ ఆఫ్రికా కి చెందిన మోడల్ Ilene Hamman ప్రధాన పాత్రలు పోషించారు. కీరవాణి మరోసారి తన ప్రతిభ ని ఈ చిత్రం లో చూపించారు. ఆయన క్రితం చిత్రాలలో గాయనీ మణులకి ఎక్కువ ప్రాధాన్యత వుంటే, ఈ చిత్రం లో ఒక్క పాట తప్ప అన్నీ గాయకులచేతే పాడించారు. పైగా, ఈ చిత్రం లో రెండు పాటలు కీరవాణి స్వయం గా ఆలపించారు. మొదట ఈ చిత్రానికి పాకిస్తానీ గాయకుడు Ali Azmat కూడా ఒక పాట రూపొందిస్తారు, దానిలో ఆయనే నటిస్తారు అని వార్తలు వచ్చాయి. కానీ మరి ఏమయిందో, ఆయన ఈ ప్రోజెక్ట్ లో పాలు పంచుకోలేదు.

## Guzar Na Jaaye (9/10)

ఈ పాట రెండు వెర్షన్లు వున్నాయి. ఒకటి శ్రేయా ఘోశల్ పాడగా, రెండోది కీరవాణి పాడారు. దీని ట్యూన్ పాతదే! తెలుగు చిత్రం "ఒకరికి ఒకరు" లోని "వెళ్ళిపోతే ఎలా" కి వాడారు. కాకపోతే, ఈ కొత్త వెర్షన్ లో కొంచెం పోలిష్ చేసారు అదే ట్యూన్ ని. తెలుగు లో కూడా పాడినది కీరవాణి, శ్రేయా ఘోశల్. ఏమైనా, హిందీ లో ఇంకా మెరుగుపరచటం వలన బాగున్నట్టు అనిపించింది. ఆర్కెస్ట్రయిజేషన్ దీనికి రిచ్ గా వుంది. పాడిన విధానం గుసగుసలు పోతున్నట్టు వుండటం వలన, ఆమె పాడుతున్నది ఏమిటో అర్థం చేసుకోవటానికి రెండు మూడు సార్లు వినాల్సి వచ్చింది. చక్కటి స్టీరియో సిస్టమ్ లో వింటే చాలా బాగుంది ఈ పాట. శ్రేయా స్వరం ని సింథసైజ్ చేయటం వలన ఆమె స్వరం లో స్వతహా వినిపించే స్వీట్ నెస్ అంతగా వినిపించదు. ఇంక కీరవాణి పాడిన వెర్షన్ విషయానికి వస్తే, ఆయన స్వరం చాలా ప్రత్యేకమైన విషాదం, గంభీరాల మిశ్రమం అనిపిస్తుంది. శ్రేయా స్వరం కన్నా ఆయన స్వరం స్ట్రాంగ్ అవటం వలన ఆయన పాడినది కొంచెం క్లియర్ గా వుంది. రెండిటిలో ఏది బాగుంది అంటే జవాబు కష్టం. నాకు ఇద్దరి దీ నచ్చింది. రెండు పాటల్లో మధ్య లో KK ఒకటి రెండు ముక్కలూ, హమ్మింగ్ చేసారు. ఆయన కూడా బాగా పాడారు.

## Khoobsurat (8/10)

ఈ పాట కూడా రెండు వెర్షన్లు వుంది. ఒకటి ఉదిత్ నారాయన్ పాడితే, రెండోది కీరవాణి పాడారు. వయొలిన్ ని కీరవాణి ఉపయోగించినంత చక్కగా మరే సంగీత దర్శకుడూ ఉపయోగించినట్టు అనిపించదు నాకు. ఉదిత్ నారాయన్ ఈ తరహా పాటలు చక్కగా పాడగలరు. బాగా పాడారు కూడా. ఆయన స్వరం లో ఆ సిన్సియారిటీ, ప్రేమ, ఆర్థ్రత అన్నీ చక్కగా పలుకుతాయి. అంత చక్కని స్వరానికి మంచి సంగీతం, అర్థవంతమైన లిరిక్స్ తోడు అయితే ఆ పాట వినేవారికి నచ్చటం లో ఆశ్చర్యం లేదు. కానీ, ఈ పాట ని వింటుంటే, నాకు ఎదో పాట గుర్తు వచ్చింది. ఆర్కెస్ట్రయిజేషన్ కొంచెం అనూ మలిక్ స్టయిల్ ని పోలి వుండటం వలన ఎమో! ఇంక కీరవాణి పాడిన వెర్షన్ విషాద గీతం లా అనిపించింది. ఆయన స్వరం లో వుండే ఆ ప్రత్యేకత వలన కావచ్చు. తక్కువ సంగీతం వుండటం వలన సూతింగ్ గా వుంది వినటానికి. చరణాలు ఎత్తుకోవటం ఉదిత్ పాడిన విధానం లో కొంచెం అవసరం కన్నా లౌడ్ గా వుండగా, కీరవాణి పాడిన పాట లో సరైన లిమిట్ లో వున్నట్టు అనిపించింది. కాకపోతే ఉదిత్ నారాయన్ స్వరం ఫ్లో అయినట్టు కీరవాణి స్వరం ఫ్లో అవలేదు. ఆయన స్వరం కొన్ని చోట్ల వణుకు వినిపించింది. మొదటి సారి విన్నప్పుడు ఏమీ

ప్రత్యేకతలు వున్నట్టు అనిపించకపోయినా వినగా వినగా నచ్చే పాట.

## Maine Dil Se Kaha (10/10)

దీనిని పాడింది K K. నా అభిమాన గాయకుల్లో K K ఒకరు. Jism లో "జాదూ హై నషా హై", Paap చిత్రం లో "ఇంతెజార్" పాటల స్థాయిలో ఈ చిత్రం లో ఏమీ పాటా వున్నట్టు లేదే అనుకుంటున్న సమయం లో వచ్చిన పాట ఇది. ఆ రెండు పాటల మల్లే దీనిలో కూడా ప్రత్యేకత అల్లా దాని సింప్లిసిటీ, చక్కటి లిరిక్స్. గాయకుడు దీనిని పాడటానికి ఎక్కడా తన స్వరాన్ని స్ట్రెచ్ చేయలేదు. కానీ సింపుల్ గా, ఒక కంట్రోల్ లో పాడి చక్కటి ముద్ర వేసారు. ఈ రకం జెమ్ ని కేవలం కీరవాణి తప్ప వేరే ఏ దర్శకుడూ ఇంతవరకూ ఇవ్వలేదు. అంటే, ఈ పాట అద్భుతం అని కాదు, ఏ ప్రత్యేకతలు లేకపోయినా మనసుకి హత్తుకునే విధమైన సంగీతం, ట్యూన్ తో పాటని రూపొందించటం గురించి నేను చెపుతున్నా. KK కూడా తన వంతు పాత్ర ని చక్కగా పోషించారు. పాట లిరిక్స్ లో వున్న అర్థన్ని అర్థం చేసుకొని, ఎంతో ఆర్ద్రం గా ఆలపించారు.

## Rog Theme (7/10)

దీనిని రూపొందించినది Music Mushrooms. మర్డర్ మిస్టరీ కి అవసరమైన జేమ్స్ బాండిష్ "టుడుం.. టుడుం" సంగీతం కాదు ఇది. కానీ వింటుంటే ఒక మిస్టరీ, ఒక విషాదం, ఒక ఎనిగ్మాటిక్ మూడ్ ని ప్రతిబింబిస్తూ చేసేలా వుంది.

## Sufani (6/10)

దీనిని రూపొందించినది Gaudi. రోగ్ థీమ్ వలెనే ఇది కూడా ఈస్ట్-వెస్ట్ సంగీతాల మిశ్రమం. హెవీ బీట్స్ వున్న సూఫీ నెంబర్ ఇది. ఈ పాటని రెండు మూడు సార్లు విన్నప్పటికీ గాయకులు పాడుతున్నది ఏమిటో నాకు అర్థం కాలేదు. స్పష్టత లేనట్టు అనిపించింది. అదొక పంథా అనుకుంటా! బీట్ మాత్రం బాగుంది. ఆల్బమ్ లోని మిగిలిన పాటలతో పోలిస్తే, బోరింగ్ పాటగానే అనిపించింది.

## Tere Is Jahan Mein (8/10)

దీనిని కూడా పాడింది KK. టిపికల్ కీరవాణి పాట. అంటే, అతి తక్కువ సంగీతం, గాయకుడి గుసగుసలని పోలిన పాడిన విధానం తో వినగానే ఇది కీరవాణి రూపొందించిన గీతం అని గుర్తు పట్టే విధం గా వుంది. ఈ తరహా పాటలు పాడటం చాలా కష్టం. ఎందుకంటే, గాయకుడి స్వరం లోని అపస్వరాలూ, లొసుగులు అన్నీ ఈ తరహా పాటలలో బయట పడుతూ వుంటయి. కానీ KK స్వరం శృతి తప్పటం అరుదు. కనుక ఆయన ఈ పాటని సమర్థవంతం గా పాడారు.

మంచి ప్రతిభావంతుడైన నటుడు ప్రధాన పాత్రలో, చక్కటి సంగీతంతో వస్తున్న ఈ ఎరోటిక్ థ్రిల్లర్ లోని పాటలు నాకు నచ్చాయి. మీరు కీరవాణి సంగీతం అంటే ఇష్టపడేవారు అయితే, మీకు కూడా ఈ అల్బమ్ తప్పక నచ్చుతుంది.